# ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం



సంగారెడ్డిలో రేణుకాఎల్లమ్మ గుడి ప్రారంభోత్సవ గోడ పత్రికలను విడుదల చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రాయికోడ్, మార్చి 20 : మండలంలోని కర్చల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రేణుకాఎల్లమ్మ గుడి ప్రారంభోత్సవానికి హాజరుకావాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గ్రామ గౌడ సంఘం సభ్యులు కోరారు. సంగారెడ్డిలో కలిసి రేణుకాఎల్లమ్మ గుడి ప్రారంభోత్సవ గోడ పత్రికలను విడుదల చేయించారు. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ జడ్పీటీసీ అంజయ్య, మండల జైగౌడ సంఘం అధ్యక్షుడు బాబాగౌడ్, మాజీ సర్పంచ్ బాబుకుమార్, ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ గౌడ్, సంగమేశ్వర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, విష్ణు గౌడ్, గాజుల ఫణిరాజు ఉన్నారు.

# ఉపాధ్యాయులుగా విద్యార్థులు



బిలాల్‌పూర్ పాఠశాలలో స్వయంపాలనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోహీర్, మార్చి 20 : మండలంలోని బిలాల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈవోగా అరుణ్, హెచ్ఎంగా రాజు, ఉపాధ్యాయుగా గాయత్రి, స్వాతి, రంష నాగ్, జ్యోత్స్న, ప్రవళిక, నందిని, అంజయ్య, సాత్విక్ ప్రతిభను కనబర్చారు. అనంతరం ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాఘవులు, ఉపాధ్యాయులు లుల్గొన్నారు.

# మూణ్ణాళ్ల ముచ్చటగా మరమ్మతులు



హత్నూర ఐటీఐ కాలనీ వద్ద నాణ్యతాలోపంగా పనులు చేపట్టడంతో ధ్వంసమైన రోడ్డు

హత్నూర, మార్చి 20: మండలంలోని పలు గ్రామాల రోడ్లకు నాణ్యతాలోపంగా మరమ్మతు పనులు చేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలకేంద్రమైన హత్నూర, గోవిందరాజ్‌పల్లి, సిరిపుర, దేవులపల్లి, దౌలాపూర్, సికింద్లాపూర్ తదితర గ్రామాల ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ఇటీవల మరమ్మతు పనులు చేపట్టారు. కొన్నిచోట్ల రోడ్డుపై కేవలం కంకర, డస్ట్‌పోసి వదిలేయడంతో మళ్లీ రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయి. పనులు చేపట్టి నెల రోజులు గడవకముందే రోడ్డు ధ్వంసం కావడంతో ప్రజాధనం వృథా అవుతుందని ప్రజ లు ఆరోపిస్తున్నారు. మరమ్మతు పనులు జరిగే సమయంలో పర్యవేక్షించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో చేపట్టిన పనులు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లను బాగుచేయాలని కోరుతున్నారు.

# నీటి వనరులపై రైతులకు అవగాహన



అందోల్: డాకూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అందోల్, మార్చి 20: సంగుపేట ఏరువాక కేంద్రం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, శాస్త్రవేత్తలు బుధవారం మండలంలోని డాకూర్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నీటి వనరులు, వసతులపై అధ్యయనం చేశారు. గ్రామాల్లో ఉన్న వసతులు, వనరులు, కాలమాన పట్టిక, నీటి వసతులుపై పటాల ద్వారా రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత సరిత, ఏవో విజయరత్న, ఏఈవో శ్రీకర్, రైతులు పాల్గొన్నారు.

# జాతీయ శిబిరానికి తారా విద్యార్థులు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 20: విద్యార్థులు జాతీయ యువ సంగమం శిబిరానికి ఎంపికయ్యారని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా జాతీయ యువసంగమం శిబిరానికి విద్యార్థులు ఎంపికవ్వడం కళాశాలకే గర్వకారణమన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాట్నాలోని ఐఐటీని సందర్శించి ఈనెల 23 వరకు వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేస్తారని చెప్పారు. రాష్ట్రం నుంచి మొత్తం 45మంది విద్యార్థుల్లో తారా కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల తరపున వారిని అభినందించారు.

# ముగిసిన మల్లన్న ఉత్సవాలు



మల్లన్నకు ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, మార్చి 20 : గుమ్మడిదలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మల్లన్న ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనం గా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ‘చె’త్తశుద్ధేది..?

- పోగైన చెత్తను తగులబెడుతున్న గ్రామ పంచాయతీలు
- ప్రత్యేకాధికారుల పాలనలో బుగ్గిపాలవుతున్న చెత్త
- తడి, పొడి పేరున చెత్త సేకరణ
- ఒక్కచోటే తగులబట్టేస్తున్న వైనం
- ప్లాస్టిక్ కాల్చి పర్యావరణానికి తూట్లు
- కానరాని సేంద్రియ ఎరువుల తయారీ



ఇస్నాపూర్ డంప్‌యార్డు ప్రాంగణంలో చెత్తను తగులబెడుతున్న దృశ్యం

పటాన్‌చెరు, మార్చి 20 : తడి, పొడి చెత్త వేర్వేరుగా బకెట్లలో పెట్టి పంచాయతీల చెత్త బండిలో వేయాలని ఉదయం మైకుల్లో అరిచి సేకరిస్తున్నారు. తడి, పొడి చెత్తను విడదీయని పక్షంలో చెత్తబండి నిర్వాహకులు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చెత్త సేకరణ బాగానే జరుగుతున్నా, సేకరించిన చెత్తను పంచాయతీలు ఏమి చేస్తున్నాయని పరిశీలిస్తే పర్యావరణ వేత్తలు, ప్రకృతి ప్రేమికుల గుండెలు ఝుళ్లుంటాయి. తడి,పొడి పేరున సేకరించిన చెత్తను ఒకచోట చేర్చి నిప్పు పెట్టేస్తున్నారు. చెత్తతో సంపద సృష్టి, చెత్త రీసైక్లింగ్ అనే ముచ్చట్లు నినాదాలుగానే మారుతున్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలోని మేజర్ పంచాయతీలు ఇప్పుడు మున్సిపాలిటీల స్థాయి జనాభాతో నిండిపోయాయి. అదే స్థాయిలో రోజూ టన్నులకొద్దీ చెత్త పోగవుతున్నది. ఈ చెత్తను నేరుగా డంపింగ్ యార్డుల పరిధిలోని ఖాళీ జాగాల్లో వేసి తగులబెడుతున్నారు. చెత్త తగలబెట్టడాన్ని కేంద్ర సర్కార్, కోర్టులు సైతం నిషేధించాయి. కానీ, ఇవేవి పట్టని అధికారులు పోగైన చెత్త కుప్పలకు నిప్పుపెట్టి బూడిద చేస్తున్నారు. దీంతో పర్యావరణ కాలుష్యం చోటుచేసుకుంటున్నది. ఒకప్పుడు ఆదర్శంగా కనిపించిన డంపింగ్‌యార్డులు ఇప్పుడు నిర్వహణ కరువై కంపుకొడుతున్నాయి. వానపాములను ఉపయోగించి సేంద్రియ ఎరువులు తయారుచేసే ప్రక్రియ నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం రాగానే అధికారులు పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేక అధికారుల పాలన రావడంతో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా అధ్వానంగా మారిందని ప్రజలు చెబుతున్నారు.

**ఇస్నాపూర్‌లో కంపే ఇంపు..**

ఇస్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 50వేలకు మించి జనం నివసిస్తున్నారు. తడి,పొడి చెత్తను సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది నేరుగా రోడ్ల పక్కన డంప్ చేస్తున్నారు. డంపింగ్ యార్డు వెనుకభాగంలో చెత్తను తగులబెడుతున్నారు. మార్కెట్‌లో, గృహాల నుంచి, పరిశ్రమల వ్యర్థాలను తీసుకొచ్చి నేరుగా డంప్‌యార్డు కంపౌండ్‌లో వేసి తగులబెడుతున్నారు. దీంతో నందిగామ రోడ్డు, ఇందిరమ్మ కాలనీలో దట్టమైన పొగలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, దవాఖాన వ్యర్థాలను సైతం అగ్గికి ఆహుతి చేస్తుండడంతో విషవాయులు వ్యాప్తి చెందుతున్నాయి. ముత్తంగిలోనూ సుచీరిండియా గుంతల్లో చెత్తను వేసి తగులబెడుతున్నారు. చిట్కుల్‌లో నక్కవాగు గట్టున పోగైన చెత్తను తగులబెడుతున్నారు. భానూర్‌లో డంప్ యార్డు వెనుకభాగంలో చెత్తను తగులబెడుతున్నారు. తద్వారా వాయు కాలుష్యం చోటుచేసుకుంటున్నది.

**తగులబెడితే చర్యలు తీసుకుంటాం..**

పటాన్‌చెరు మండలంలోని అన్ని గ్రామాల్లో డంప్‌యార్డులను తనిఖీ చేస్తాం. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తాం. పోగవుతున్న చెత్తను పునర్వినియోగం చేసుకునేలా ఆదేశాలు ఇస్తాం. చెత్తను తగుల బెట్టడం తప్పు. నిబంధనల మేరకు చెత్త సేకరణ చేయాలి. చెత్తను సహజ ఎరువులుగా తయారు చేసుకోవాలి. ఇలా చేయని పం చాయతీలపై చర్యలు తీసుకుంటాం.

-హరిశంకర్‌గౌడ్, ఎంపీవో పటాన్‌చెరు

# ప్రభుత్వ భూములను రక్షించాలి

- భూముల చుట్టూ ఫెన్సింగ్ వేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి


సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 20: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, జిన్నారం తదితర మండలాల్లో చెరువులు, కుంటలు, ఇతర ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్ పరిధిని అధికారులు సర్వే చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. మైనింగ్ అనుమతులకు రెవెన్యూ ఎన్వోసీ తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనుమతి పొందిన మేరకే మైనింగ్ జరిగేలా అధికారులు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బొల్లారం ఎర్రగుంట చెరువులో ఏర్పాటు చేసిన వెంచర్ వివరాలు వెంటనే ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ అధికారుల సమన్వయంతో నోటీసులు అందజేసి ఆక్రమణలు తొలిగించేలా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ అధికారులు నోటీసులు మాత్రమే ఇచ్చి చర్యలు చేపట్టడం లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, డీపీవో సాయిబాబా, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఓటు హక్కు కల్పించాలి

కోహీర్, మార్చి 20 : ప్రతిఒక్కరికీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని తహసీల్దార్ బాలశంకర్ అన్నారు. బుధవారం కోహీర్ పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఆయా గ్రామాల బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలశంకర్ మాట్లాడుతూ 85 ఏండ్లు వయస్సు నిండిన వారితోపాటు దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలన్నారు. అర్హులకు ఓటుహక్కు కల్పించేందుకు బీఎల్వోలు సర్వే చేపట్టాలన్నారు.

# ఇవేం కరెంట్ కోతలు

- మెయింటెనెన్స్ పేరిట సరఫరా నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, రైతులు



బుధవారం బోర్పట్ల శివారులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపట్టడంతో హత్నూర, రెడ్డిఖానాపూర్, గుండ్లమాచునూర్, తుర్కలఖానాపూర్ గ్రామాల

హత్నూర, మార్చి 20: ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని ప్రభుత్వం విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పేరిట గంటల తరబడి కరెంట్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అసలే వేసవికావడంతో ఒకవైపు ఎండలు, మరోవైపు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా కరెంట్ కోతలతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్లకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు కరెంట్ లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమైన విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ రాఘవను సంప్రదించగా బోర్పట్ల సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు ఉన్నందున కరెంటు సరఫరా నిలిపివేశామన్నారు.

# గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పోషణ్ పక్వాడా నిర్వహిస్తున్న జిల్లా ఐసీడీఎస్ అధికారి లలితాకుమారి

కోహీర్, మార్చి 20: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ జిల్లా అధికారి లలితాకుమారి అన్నారు. బుధవారం జహీరాబాద్ ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డల క్షేమం కోసం తల్లులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు సీమం తం చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో కల్పన, అనిత, లక్ష్మమ్మ, సునీతబాయి, తులసి, అంజమ్మ, అనితాకుమారి, నీరజా, విజయలక్ష్మి, సద్గుణ, రాధమ్మ పాల్గొన్నారు.

# సేంద్రియ సాగు చేపట్టాలి




రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

కోహీర్, మార్చి 20 : రైతులందరూ సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ స్నేహలత పేర్కొన్నారు. బుధవారం జహీరాబాద్ మండలంలోని దిడ్గి గ్రామ డీడీఎస్, కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో ఐసీఏఆర్ అటారి సహకారంతో సేంద్రియ వ్యవసాయంపై కంగ్టి మండల రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల సాగు, వినియోగం, వాటి ప్రాముఖ్యతను వివరించారు. మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు, ఎరువుల తయారీ, కషాయాల తయారీ గురించి రైతులకు నేర్పించారు. చిరుధాన్యాలను ఇతర రైతులతో సాగు చేయించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. శైలజ, రమేశ్, కైలాస్, ప్రియాంక, స్వామి, శ్రీకాంత్, శ్రీధర్, జగన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# పెన్షనర్లకు నగదురహిత వైద్యసేవలు అందించాలి



మంత్రి దామోదరతో విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు

సంగారెడ్డి, మార్చి 20 : ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విన్నవించారు. బుధవారం పట్టణంలోని మంత్రి నివాసంలో రాష్ట్ర సంఘం ప్రధానకార్యదర్శి చిల్వారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో నగదురహిత వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు దవాఖాన బిల్లులు చెల్లించలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో పెన్షనర్ల సంఘం జిల్లా నాయకులు నవాబురెడ్డి, జగదీశ్వర్, బసవేశ్వర్ తదితరులు ఉన్నారు.

# కుష్టు వ్యాధి నివారణకు ఇంటింటి సర్వే

జిన్నారం, మార్చి 20 : జిన్నారంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది కుష్టు వ్యాధి నివారణకు బుధవారం ఇంటింటి సర్వే చేపట్టారు. జిన్నారంతోపాటు పెద్దమ్మగూడెం, నర్రిగూడెం గ్రామాల్లో ఆశ వర్కర్లు నాగమణి, నజీమా ఇంటింటి సర్వేలో అందుబాటులో ఉన్న వారితో మాట్లాడి పరిశీలించారు. ఈ సర్వేలో ఒకరికి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్వే 24వ తేదీ వరకు కొనసాగుతుందని ఆశ వర్కర్లు తెలిపారు.



ఇంటింటి సర్వే చేస్తున్న ఆశ వర్కర్లు

# భారీగా నిషేధిత సిగరేట్లు స్వాధీనం

అందోల్, మార్చి 20: జోగిపేటలోని పలు కిరాణా దుకాణాల్లో బుధవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి పెద్దమొత్తంలో నిషేధిత సిగరేట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆరు దుకాణాలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వీరబద్ర, గణేశ్, సాయి, విజయ్, తుల్జాభవానీ, కనకదుర్గ కిరాణా దుకాణాల్లో టాస్క్‌ఫోర్సు అధికారులు సోదాలు చేయగా సుమారు రూ.లక్ష విలువైన నిషేధిత సిగరేట్లు దొరికినట్లు ఎస్సై తెలిపారు. దీంతో దుకాణాల యజమానులపై కేసు నమోదు చేశామన్నారు. జోగిపేటలో కొద్దిరోజులుగా నకిలీ సిగరేట్లతోపాటు ఇతర నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వీటి విక్రయాలుపై దృష్టి పెట్టాలన్నారు.

# అక్రమ నిర్మాణాలు కూల్చివేత



జేసీబీతో కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అమీన్‌పూర్ మార్చి 20: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 1056 ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు తెలుసుకున్న రెవెన్యూ అధికారు బుధవారం కూల్చివేశారు. అనంతరం డిప్యూటీ తసీల్దార్ బాలరాజు ఆర్ఐ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభు త్వ స్థలాలను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు డేగకన్నుతో కాపాడుకుంటారని చెప్పారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మడిదల/జిన్నారం, మార్చి 20: గుమ్మడిదల మండలంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయం త్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పటాన్‌చెరు డీఈ రమేశ్ తెలిపారు. బుధవారం మండల విద్యుత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మడిదల ఏడీ శ్రీకాంత్, జిన్నా రం ఏఈ రాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు

మునిపల్లి, మార్చి 20: వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిక స్థానాల్లో గెలుపొందుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయికుమార్ అన్నారు. బుధవారం ఆయన మునిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100రోజులు గడిచినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయడంలేదని ఎద్దేవా చేశారు. వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై రాష్ట్ర ప్రజలు విసుగు చెందారన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ విజయన్ని ఆపలేరన్నారు. బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ భారీమెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# ఉపాధి బకాయిలు చెల్లించాలి

సదాశివపేట, మార్చి 20 : ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూర్, ఏటిగడ్డసంఘం గ్రామా ల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. పని చేసిన 15 రోజులకే ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాల్సి ఉన్నా రెండునెలలు గడుస్తున్నా ఎందుకు డబ్బులు చెల్లించడం లేదని ప్రశ్నించారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్లు, మంచినీటి సౌకర్యం ఎందుకు కల్పించడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీ రూ. 800 పెంచాలని, ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీలో జియోట్యాగింగ్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంగయ్య, సుశీల, దశరథ్, లక్ష్మయ్య, నాగమణి, సంజీవులు, అంజమ్మ, మల్లేశం, శివయ్య, బుచ్చమ్మ, నారాయణ పాల్గొన్నారు.

# కూలీల సంఖ్య పెంచాలి

కల్హేర్, మార్చి 20: ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఐదువేల మొక్కలను వానకాలం వరకు సిద్ధం చేయాలని డీఆర్డీఏ ఏపీడీ బాల్‌రాజ్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి ఎదుట రెండు కుంకుడు, ములగ మొక్కలను ప్రతిఒక్కరూ పెంచేలా కృషి చేయాలన్నారు. వంద శాతం కూలీలకు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ రాజు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో శ్యాం ఉన్నారు.